న్యూస్‌రీల్

జలదాతకు నివాళి


కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: గోదావరి జలాల జల ప్రాణదాత సర్ ఆర్థర్ కాటన్ 222వ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ కార్యాలయంలో కాటన్ విగ్రహానికి జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, వీవీవీఎస్ లక్ష్మణ రావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీర్ శ్రీనివాస్, పీఆర్ఐ డివిజన్ మల్లికార్జున, ఉపకార్యనిర్వాహక ఇంజినీర్లు, పంచాయతీరాజ్, జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వనదుర్గ అమ్మవారికి చండీహోమం



అన్నవరం: వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు హోమం నిర్వహించి తరువాత పూర్ణాహుతి నిర్వహిస్తారు. రూ.750 టిక్కెట్‌తో భక్తులు ఈ హోమంలో పాల్గొనవచ్చునని అధికారులు తెలిపారు. కాగా స్వామివారి కల్యాణ మహోత్సవాలలో వనదుర్గ అమ్మవారికి హోమాలు నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ నెల 25వ తేదీన శృంగేరీ పీఠాధిపతి విజయవాడ వస్తున్న సందర్భంగా అక్కడ వారిని కలిసి కల్యాణోత్సవాలలో హోమాల నిర్వహణపై వారి అభిప్రాయం తెలుసుకుని భవిష్యత్తులో ఆ మేరకు వ్యవహరించాలని భావిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ గురువారం 'సాక్షి'కి తెలిపారు. జగద్గురు ఆదిశంకరాచార్య ఈ అమ్మవారిని ఆ పీఠంలో ప్రతిష్ఠించారు. వందేళ్ల క్రితం అప్పటి శృంగేరీ పీఠాధిపతులు అన్నవరంలోని రత్నగిరి క్షేత్రపాలకురాలిగా వనదుర్గ అమ్మవారిని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి అవిచ్ఛిన్నంగా అమ్మవారికి నిత్య పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు.

ఈ సెట్-25 ఫలితాల్లో 95.08 శాతం ఉత్తీర్ణత

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఈ సెట్-25 ఫలితాల్లో కాకినాడ జిల్లా 95.60 శాతం ఉత్తీర్ణతతో నిలిచింది. పరీక్షకు 1,809 మంది హాజరు కాగా 1,720 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలుర విభాగంలో 1,160 మంది ఉత్తీర్ణులు కాగా బాలికల విభాగంలో 560 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫార్మసీ విభాగంలో మాధవపట్నం గ్రామానికి చెందిన వాసంశెట్టి కావ్యశ్రీ 113మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంక్ సాధించింది. పరీక్షను జేఎన్‌టీయూ అనంతపురం యూనివర్సిటీ మే 6వ తేదీన నిర్వహించింది.

ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిలో జిల్లాకు పదవ స్థానం

కాకినాడ క్రైం: ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిలో జిల్లా రాష్ట్ర స్థాయిలో పదవ స్థానం పొందిందని డీఎంహెచ్‌వో నరసింహనాయక్ తెలిపారు. ఈ మేరకు, గురువారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మాతాశిశు సేవలు, వ్యాధి నిరోధక టీకాల పంపిణీ, కౌమార దశ బాలికల ఆరోగ్య సేవలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పనితీరు, ఏబీహెచ్ఏ ఐడీల నమోదు తదితర అంశాల ప్రాతిపదికన ఈ స్థానం లభించిందని డీఎంహెచ్‌వో అన్నారు. మ్యాట్రిక్స్ పాయింట్లలో కాకినాడ జిల్లాకు 80.08 శాతం మార్కులు వచ్చాయని తెలిపారు.

తమ్ముళ్లే భూచోళ్లు!



- గొల్లప్రోలులో సర్కార్ భూమి స్వాహాకు కుట్ర
- రూ.15 కోట్ల ప్రభుత్వ ఆస్తికి కాళ్లు
- నాడు ప్రభుత్వానిది అని నిర్ధారణ
- నేడు ప్రైవేటు భూమంటూ బుకాయింపులు
- ముడుపులు మెక్కి చక్రం తిప్పుతున్న కీలక అధికారి


గొల్లప్రోలులో వివాదాస్పదంగా మారిన రూ.15 కోట్ల విలువైన భూమి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సర్కార్ భూములకే దిక్కూమొక్కూ లేకుండా పోతోంది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చూస్తే భూ కబ్జాలు, అక్రమాలపై తాట తీస్తానంటున్నారు. తీరా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ప్రభుత్వ భూమి కబ్జా అయిపోతుంటే కన్నెత్తి చూడకపోవడానికి కారణమేమై ఉంటుందని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కూటమి సర్కార్ గద్దెనెక్కాక ప్రభుత్వ, ప్రైవేటు అనే తేడా లేకుండా భూములపై కన్నేసి కొల్లగొట్టేస్తున్నారు. రికార్డులను తారుమారు చేయడంలో చేయి తిరిగిన రెవెన్యూ అధికారులు ముడుపులు మెక్కి ప్రభుత్వ భూములను ప్రైవేటు వారికి కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం వాస్తవాలు తొక్కిపెట్టిందో ఏమిటో తెలియదు కానీ జిల్లా స్థాయిలో అధికారులు ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు పచ్చజెండా ఊపేశారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ భూమి అని నిర్ధారించగా కూటమి గద్దెనెక్కాక తెలుగు తమ్ముళ్ల ఒత్తిళ్లతో ప్రభుత్వ భూమి కాస్తా ప్రైవేటు భూమి అయిపోతోంది. పిఠాపురంలో టీడీపీకి చెందిన ఒక ముఖ్యనేత సర్కార్ భూ కబ్జా పర్వానికి కర్త, కర్మ, క్రియ అంతా అంటున్నారు. ఆయన తెర వెనుక ఉండి నడిపిస్తున్న ఈ భూ భాగోతంపై ఆ ప్రాంతంలో కొందరు నేతలు పోరాటం చేస్తున్నారు.

టీడీపీ నేత కన్ను

పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు నగర పంచాయతీలో జరుగుతోన్న భూ భాగోతమిది. ఈ భాగోతం ప్రస్తుతం కాకినాడ రెవెన్యూలో హాట్‌టాపిక్‌గా మారింది. నగర పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 579లో గ్రామ పంచాయతీకి 1.52 ఎకరాల భూమి గ్రామ కంఠంగా ఉంది. ఈ విషయం గొల్లప్రోలు ఫెయిర్ అడంగల్‌లో స్పష్టంగా ఉందని అక్కడి ప్రజలు, నేతలు చెబుతున్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో ఇళ్ల నిర్మాణాలు పెరగడంతో ఇక్కడ భూముల ధరలు బాగా పెరిగాయి. ఈ ఎకరా 52 సెంట్లు భూమి 7,296 గజాలు వస్తోంది. తహసీల్దార్ కార్యాలయానికి సమీపాన తాటిపర్తి రోడ్డు పక్కన గజం రూ.30వేలు పైనే పలుకుతోంది. అదే ఈ భూమికి పరిసరాల్లో గజం రూ.20వేలు ఉంది. ఈ లెక్కన చూసుకుంటే గ్రామకంఠంగా చెబుతోన్న ఈ భూమి విలువ సుమారు రూ.15 కోట్లు పలుకుతోంది. ఈ ప్రాంతంలో భూముల విలువ పెరిగిపోవడంతో తెలుగుదేశం పార్టీ ముఖ్య నేత కన్ను దీనిపై పడింది. అలాగని ఆయన ఎక్కడా బయట పడకుండా తెరవెనుక చక్రం తిప్పుతూ భూ బదలాయింపు ప్రక్రియ నడిపిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భూమి నాదంటూ కోర్టుకు..

ఇదిలా ఉండగా, ఈ భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం, ఆ భూమికి పన్ను వేయాల్సిందిగా కేదారిశెట్టి వెంకటసూర్యనారాయణ రెవెన్యూ అధికారులకు 2023 జూన్ 6న దరఖాస్తు చేశారు. 579 సర్వే నంబర్‌లో ఉన్న 1.52 సెంట్ల భూమి ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో పక్కాగా ఉందని నిర్ధారిస్తూ అప్పటి తహసీల్దార్ ఉత్తర్వులు జారీచేశారు. దీనిపై కేదారిశెట్టి తదితరులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను సమీక్షించిన మీదట ఈ భూమికి పన్ను విధించడం వీలుకాదని గొల్లప్రోలు నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్ కోర్టుకు సమాచారం అందించింది. ఫెయిర్ అడంగల్‌లో కూడా గ్రామ కంఠంగా ఉందని నగర పంచాయతీ కమిషనర్‌కు తహసీల్దార్ నివేదించారు.

కౌన్సిలర్ ఫిర్యాదుతో ఈ భూబాగోతం వెలుగులోకి..

గొల్లప్రోలు ఫెయిర్ అడంగల్‌లో గ్రామ కంఠంగా ఉన్న ఈ భూమి కబ్జా కాకుండా పరిరక్షించాలంటూ గొల్లప్రోలు నగర పంచాయతీ 13వ వార్డు కౌన్సిలర్ వడిశల సత్తిబాబు 2.8.2022న గొల్లప్రోలు తహసీల్దార్, నగర పంచాయతీ కమిషనర్‌కు చేసిన ఫిర్యాదుతో ఈ భూబాగోతం వెలుగులోకి వచ్చింది. దీనిపై విచారించిన అప్పటి తహసీల్దార్ భూమి రికార్డుల ప్రకారం గ్రామకంఠంగా 25.10.2022న నిర్ధారించారు. ఈ భూమి కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని నిషేధిత జాబితా 22 పీఓబీ రిజిస్టర్‌లో చేరాల్సిందిగా గొల్లప్రోలు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అక్విజేషన్(సీసీఎల్ఏ)కు లేఖ రాశారు. సీసీఎల్ఏ జిల్లా రెవెన్యూ అధికారులకు అక్కడి నుంచి తహసిల్దార్‌కు 22 ఏలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. రికార్డుల్లో పక్కాగా ప్రభుత్వ భూమిగా ఉందని అయితే దీనిని పరిరక్షించాల్సిన బాధ్యత గొల్లప్రోలు నగర పంచాయతీదేనంటూ తహసీల్దార్ పేర్కొన్నారు. ఇదే విషయాన్ని రాజమహేంద్రవరం మున్సిపల్ రీజనల్ డైరక్టర్ కూడా నిర్ధారించారు. ఈ క్రమంలో గొల్లప్రోలు నగర పంచాయతీ తరఫున చైర్‌పర్సన్ మంగతాయారు ఈ భూమికి పన్ను వేయడం, వసూలు చేయడం కుదరదని, ఈ భూమిలో నగర పంచాయతీ కార్యాలయం, కమ్యూనిటీహాలు నిర్మాణానికి వినియోగించాల్సిందిగా కమిషనర్‌కు గత నెల 21న లేఖ రాశారు.

రెవెన్యూ అధికారి కనుసన్నల్లో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ భూమి గ్రామ కంఠం పరిధిలో ఉందని సర్వే అనంతరం కమిషనర్, తహసీల్దార్ సహా అన్ని విభాగాల అధికారులు వివిధ దశల్లో నిర్ధారించారు. అటువంటి సుమారు రూ.15 కోట్లు విలువైన గ్రామ కంఠం భూమిని తెలుగు తమ్ముళ్లు తెరవెనుక ఉండి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేసే ప్రయత్నాల్లో ఉన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మూడేళ్లుగా నడుస్తోన్న ఈ భూ వ్యవహారంలో నిన్న మొన్నటి వరకు రెవెన్యూ, నగర పంచాయతీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో వివిధ దశల్లో అధికారులు 1.52 ఎకరాలు గ్రామ కంఠం అని పక్కాగా తేల్చారు. అటువంటి భూమి ప్రభుత్వం, అధికారులు మారేసరికి ప్రైవేటు భూమి అయిపోతుందా అని గొల్లప్రోలు వాసులు ప్రశ్నిస్తున్నారు. గొల్లప్రోలు మండలం నుంచి కాకినాడ వరకు కొందరు రెవెన్యూ అధికారులు ముడుపులు మెక్కి తిమ్మినిబమ్మిని చేసి గ్రామ కంఠం భూమిని ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. జిల్లాలో దాదాపు దశాబ్దంన్నరగా పాతుకుపోయిన రెవెన్యూ శాఖకు చెందిన ఒక అధికారి కనుసన్నల్లోనే మొత్తం కథ అంతా నడుస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రూ.15 కోట్ల విలువైన ప్రజల ఆస్తి పక్కదారి పట్టకుండా వాస్తవాలు నిగ్గు తేల్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజల ఆస్తిని కాపాడాలి



వివిధ దశల్లో రెవెన్యూ అధికారులు, మున్సిపల్ ఆర్డీ సర్వే నంబర్ 579లో 1.52 ఎకరాల భూమిని పక్కాగా ప్రభుత్వ భూమి అని నిర్ధారించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్ కూడా ఇదే విషయాన్ని న్యాయస్థానానికి నివేదించింది. మూడేళ్లుగా నడుస్తోన్న ఈ వ్యవహారంలో అధికారులు పక్కాగా రికార్డులు ప్రకారం గ్రామ కంఠం, ప్రభుత్వ భూమి అని చెబుతూనే ఉన్నారు. ఈ భూమిలో ప్రజాప్రయోజనార్థం గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం, కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని ప్రజలు నుంచి డిమాండ్‌లు ఉన్నాయి. రూ.15 కోట్లకు పైగా విలువైన ప్రజల ఆస్తిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే ప్రయత్నాలను జిల్లా యంత్రాంగం గుర్తించి కట్టడి చేయాల్సి ఉంది.

– గండ్రేటి మంగతాయారు, చైర్‌పర్సన్, నగర పంచాయతీ, గొల్లప్రోలు



'మీ భూమి' ప్రజాపోర్టల్(2023)లో ప్రభుత్వ భూమిగా చూపిస్తున్న దృశ్యం



'మీ భూమి' ప్రజాపోర్టల్(08-5-2025)లో ప్రభుత్వ భూమిగా చూపిస్తున్న దృశ్యం

'కోట' మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా

- నెల రోజుల ఉత్కంఠకు తెర
- మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ పోలీసు బందోబస్తు


సామర్లకోట మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు రాజీనామా పత్రం అందజేసిన చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ

సామర్లకోట: మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ గురువారం తన పదవికి రాజీనామా చేశారు. ఆమెపై వైఎస్సార్ సీపీ సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి కౌన్సిల్ సమావేశం అవుతున్న రెండు గంటల ముందు అరుణ రాజీనామా చేశారు. అందుకు దారితీసిన పరిస్థితులు ఇలా ఉన్నాయి. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 31 వార్డులు ఉన్న పట్టణంలో వైఎస్సార్ సీపీ 29 వార్డులను కైవసం చేసుకుంది. చైర్‌పర్సన్ పదవి పార్టీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు తల్లి పార్వతికి ఇవ్వాలని ముందుగా నిర్ణయించారు. అయితే పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంలో ఒకే పదవి ఉండాలని నిర్ణయించడంతో 27వ వార్డు నుంచి ఎన్నిక అయిన గంగిరెడ్డి అరుణకు ఊహించని పరిస్థితిలో చైర్‌పర్సన్ పదవి లభించింది. 26వ వార్డు కౌన్సిలర్ నక్కా లలిత అనారోగ్యంతో మృతి చెందారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఇద్దరు కౌన్సిలర్లు టీడీపీలోకి చేరారు. దాంతో టీడీపీ బలం నాలుగుకు చేరింది. చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ గత కొంతకాలంగా పార్టీ సభ్యుల వార్డులలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం లేదని, అజెండాలో అంశాలు సభ్యులకు తెలియపర్చడం లేదని మెజార్టీ సభ్యులు అసంతృప్తితో ఉన్నారు. దాంతో ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా గత నెల 2వ తేదీన బలనిరూపణ కోసం 22 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి కలెక్టరు షణ్మోహన్, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యలకు వినతి పత్రాలు అందజేశారు. మూడవ తేదీన చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఫిర్యాదులు రావడంతో ఆమెను గత నెల మూడవ తేదీన పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కాగా గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బలనిరూపణకు కలెక్టరు అవకాశం ఇచ్చారు. ఈ ప్రత్యేక సమావేశానికి కాకినాడ ఆర్డీఓ మల్లిబాబును ప్రత్యేకాధికారిగా నియమించారు. దాంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని అందరూ ఎదురుచూస్తూ ఉండగా ప్రత్యేక సమావేశానికి రెండు గంటల ముందుగా ఉదయం 9 గంటలకు చైర్‌పర్సన్ అరుణ కమిషనర్ ఎ.శ్రీవిద్యను కలిసి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. దాంతో గత నెల రోజులుగా పట్టణంలో నెల కొన్న ఉత్కంఠకు తెరపడింది. అనంతరం 11 గంటలకు ఆర్డీఓ మల్లిబాబు అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశానికి 25 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు హాజరై చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. కాగా డీఎస్పీ డి.శ్రీహరిరాజు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

రీజనల్ కోఆర్డినేటర్ బొత్స రాక



సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ ముఖ్యనేతల సమావేశం శుక్రవారం కాకినాడలో జరగనుంది. పార్టీ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త, శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. కాకినాడ డి కన్వెన్షన్‌లో జరిగే ఈ సమావేశానికి ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు, డీసీసీబీ, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు, సిటీ అధ్యక్షులను ఆహ్వానించారు. ఈ విషయాన్ని పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి దాడిశెట్టి రాజా గురువారం మీడియాకు తెలియజేశారు. ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం ప్రారంభంకానుంది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమావేశం అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు బొత్స మీడియాకు వివరించనున్నారు.

గడువులోగా హైవేల నిర్మాణం


జాతీయ రహదారుల నిర్మాణ పనులపై మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలో చేపట్టిన వివిధ జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ), రెవెన్యూ, సర్వే, ఏపీఈపీడీసీఎల్, పోలవరం ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. జాతీయ రహదారి 216 కాకినాడ-కత్తిపూడి, కాకినాడ పోర్టు-అచ్చంపేట, అచ్చంపేట-సామర్లకోట, వాకలపూడి-అన్నవరం వరకు నిర్మించనున్న జాతీయ రహదారులు, నిర్మాణ దిశలో ఉన్న రహదారుల పనులు పురోగతి, ఇతర భూసేకరణ, టెండర్ల ప్రక్రియలపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులతో చర్చించారు. ఎన్‌హెచ్ఏఐ పీడీ డి.సురేంద్ర, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి ప్రసాద్, తహసీల్దార్లు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని బీట్ ది హీట్ థీమ్‌తో నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్రంలో ప్రస్తుతం తీవ్ర ఉష్ణోగ్రతలు, హ్యూమిడ్ వాతావరణంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం సూచించిన వివిధ అంశాలతో ఈ నెల స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీకి ఏర్పాట్లు


సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరావు

కాకినాడ సిటీ: ఈ నెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి విద్యార్థులకు, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం పదోతరగతి, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై డీఆర్వో జె.వెంకటరావు, రెవెన్యూ, పాఠశాల విద్య, ఓపెన్ స్కూల్ సొసైటీ, పోస్టల్, జిల్లా పరిషత్, పోలీస్, ట్రెజరీ, రవాణా, విద్యుత్, వైద్య ఆరోగ్యం, ఆర్టీసీ, పంచాయతీ, మునిసిపల్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాల్లో 5,956 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ప్రశ్నాపత్రాలు స్టోరేజీ నిమిత్తం 18 పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో పదోతరగతి (ఓపెన్ ఎస్ఎస్‌సీ), ఓపెన్ ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని డీఆర్వో తెలిపారు. రెగ్యులర్ పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలతో పాటు ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడిట్ సప్లమెంటరీ పరీక్షలు ఉదయం పూట నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లాలో 1,151 మంది విద్యార్థులకు నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి పి రమేష్, డీటీసీ లక్ష్మికిరణ్, పోస్టల్ పీఆర్‌ఐపీ కె.ప్రసాదరావు, డీసీఈబీ సెక్రటరీ ఎం.వెంకటరావు, ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారి పి సాయివెంకటరమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి శ్రామికులపై తేనెటీగల దాడి



కపిలేశ్వరపురం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితుడు

కపిలేశ్వరపురం: మాచర గ్రామ శివారు శ్రీరామపురం ఏటిగట్టుపై జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా తుప్పలను తొలగిస్తున్న గ్రామీణ వికాస్ శ్రామికులపై గురువారం తేనెటీగలు దాడి చేశాయి. కోరుమిల్లి గ్రామ శివారు చిన్నకోరుమిల్లికి చెందిన కొండమూరి ఏసును తీవ్రంగా కుట్టడంతో అతడు అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. వెంటనే సహచర శ్రామికులు మోటారు సైకిల్‌పై కపిలేశ్వరపురం సీహెచ్‌సీకి తరలించారు. ఆస్పత్రి వైద్యాధికారి పి.రాజ్ కుమార్ పర్యవేక్షణలో వైద్యులు చికిత్స అందించారు. ఏసు కోలుకొంటున్నాడని, మరో రెండు రోజులు పర్యవేక్షణలో ఉంచి డిశ్చార్జి చేస్తామని వైద్యులు చెప్పినట్టు ఎన్ఆర్ఈజీఎస్ ఇన్‌చార్జి ఏపీఓ రజితసింగ్ తెలిపారు. అలాగే తేనెటీగల దాడిలో గంగుమళ్ల కృష్ణ, కోలపల్లి త్రిమూర్తులు స్వల్పంగా గాయపడ్డారు.

వాడపల్లి ఆలయంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



వాడపల్లి ఆలయంలో తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి క్షేత్రంలో గురువారం రాత్రి బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లు తనిఖీలు నిర్వహించారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలలో భక్తుల భద్రత దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యగా ఈ తనిఖీలు జరిపారు. ప్రధాన ఆలయంతో పాటు ప్రాంగణం, క్యూలైన్లు, ఏడు ప్రదక్షిణలు చేస్తున్న మాడ వీధులు, అన్నప్రసాద ప్రాంగణాలు, తలనీలాలు సమర్పించే ప్రాంతాలను తనిఖీ చేశారు. ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు వాడపల్లి ఆలయంతో పాటు రావులపాలెం బస్ కాంప్లెక్స్‌లో తనిఖీలు జరిపినట్టు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు.

కుట్టిందో మరణమే..

- దోమలతో అనేక వ్యాధులు
- డెంగీ అత్యంత ప్రమాదకరం
- జాగ్రత్తలు తీసుకోకుంటే తీవ్ర నష్టం
- నేడు జాతీయ డెంగీ దినోత్సవం



ఏడిస్ దోమ

ఆలమూరు: రాత్రయితే చాలు పిలవని అతిథుల్లా మన ఇంటికి వచ్చి, తెల్లవార్లూ రక్తాన్ని పీల్చేసే దోమలతో పడే బాధలు అందరికీ అనుభవమే. పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ వీటి బాధితులే. అందుకనే దోమల బారిన పడకుండా నిత్యం అనేక జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటాం. అయితే దోమలు కట్టడం వల్ల అనేక రోగాలు వస్తాయి. కొన్నిసార్లు ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంటుంది. దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందే డెంగీ జ్వరం అత్యంత ప్రాణాంతకమైంది. నేడు జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఆ వ్యాధి లక్షణాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకుందాం.

దోమ కాటుతో..

దోమ కాటు ద్వారా డెంగీ జ్వరం వ్యాప్తి చెందుతుంది. ఈ వైరస్ సోకిన వ్యక్తిని కుట్టిన దోమ మరొకరిని కుడితే అతడి రక్తంలో వైరస్ వెంటనే ప్రవేశిస్తుంది. ఈ వ్యాధి వచ్చిన వారు సరైన సమయంలో చికిత్స చేయించుకోకుంటే ఒక్కోసారి ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదముంది. డెంగీ జ్వరం సోకిన వెంటనే శరీరంలోని ఎముకల్లో ఉన్న గుజ్జు తగ్గిపోయి క్రమేపీ రక్త కణాల సంఖ్యపై తీవ్ర ప్రభావం చూపి అంతిమంగా మరణానికి దారి తీస్తుంది. ఏడిస్ దోమల నుంచి సోకే డెంగీ వైరస్ నాలుగు రకాలుగా శరీరంలోకి ప్రవేశిస్తుంది. తొలి రెండు దశల్లో జ్వర తీవ్రత రోగిపై ఒక మోస్తారు ప్రభావం చూపగా, మూడో దశలో హెమరేజిక్ జ్వరం తీవ్ర అనారోగ్యాన్ని కలిగిస్తుంది. తుది దశ అయిన డెంగీ షాక్ సిండ్రోమ్ సోకితే మృతి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ దోమలు పగటి సమయంలో మనుషులను కుడతాయి. మంచినీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో గుడ్లు పెట్టి దోమల వృద్ధికి కారణమవుతాయి.

వ్యాధి నిర్ధారణ

డెంగీ వ్యాధిని ఏలీసా (ఎన్‌ఐవీ) పరీక్ష ద్వారా నిర్ధారణ చేస్తారు. వ్యాధి సోకిన వ్యక్తికి వివిధ రక్త పరీక్షలు నిర్వహించి, వ్యాధి తీవ్రతను గుర్తిస్తారు. డెంగీ జ్వరం తరచూ వస్తుంటే వైరస్ సంబంధిత వైద్య నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేక చికిత్స తీసుకోవాలి. సాధారణంగా ఉష్ణ మండల ప్రాంతంలో ఉండే దోమలు కాటు వేయడం వల్ల ఈ వైరస్ ఎక్కువగా సోకే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ ఏడిస్ దోమల తీవ్రతను గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) 2010 మే 16వ తేదీ నుంచి జాతీయ డెంగీ దినోత్సవం జరపాలని నిర్ణయించింది. దానిలో భాగంగా ఏటా ఆ రోజున దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు వివరిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



పెదపళ్లలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ (ఫైల్)

డెంగీ లక్షణాలు

- ఆకస్మికంగా అధిక జ్వరం సంభవించడం (104 డిగ్రీలు)
- తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి
- తీవ్రమైన కండరాల నొప్పి
- అలసట, వికారం, వాంతులు
- చర్మంపై దద్దుర్లు, తేలికపాటి రక్తస్రావం
- చిగుళ్ల లేదా ముక్కు నుంచి రక్తస్రావం
- మూత్రం, మలం, వాంతిలో రక్తం
- శ్వాస ఆడకపోవడం
- అలసిపోవడం, చిరాకు



డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

జాగ్రత్తలు అవసరం

- డెంగీ వ్యాధి బాధితులు తప్పనిసరిగా వైద్యుల పర్యవేక్షణలోనే చికిత్స తీసుకోవాలి
- ఆరోగ్యకరమైన వ్యక్తి శరీరంలో ఎర్ర రక్తకణాలు (ప్లేట్‌లెట్స్) సాధారణంగా 1.50 లక్షల నుంచి 4.50 లక్షల వరకూ ఉండాలి.
- తెల్ల రక్త కణాలు నాలుగు వేల నుంచి 11 వేల వరకూ ఉండాలి.
- డెంగీ జ్వరం ద్వారా రక్త కణాలు లక్ష దిగువకు పడిపోతే సత్వరమే వైద్యుడిని సంప్రదించాలి.
- దీర్ఘకాలం తక్కువ రక్తకణాలు ఉంటే ప్రాణాంతక సమస్యలకు దారితీయవచ్చు.
- డెంగీ జ్వరం బారిన పడిన వ్యక్తి సరైన విశ్రాంతి, పౌష్టికాహారం తీసుకుంటే రక్తకణాల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది.
- తరచూ పండ్లు, ఆకుకూరలతో పాటు ఐరన్, విటమిన్లు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి



దోమకాటు వల్ల సంభవించే డెంగీ జ్వరంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వేసవిలో సైతం వర్షాలు కురుస్తుండటం వల్ల వాతావరణంలో తీవ్ర మార్పులు సంభవిస్తున్నాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టాలి. జ్వర లక్షణాలు ఉంటే సత్వరమే సమీప వైద్యులను సంప్రదించి, సరైన సమయంలో చికిత్స తీసుకోవాలి.

– కె.స్వర్ణలత, వైద్యాధికారి, సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి, ఆలమూరు.

క్వారీ లారీ బోల్తా



పొలంలోకి పల్టీ కొట్టిన క్వారీ లారీ

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు – లంపకలోవ రహదారిలో గురువారం ఓ క్వారీ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. లాటరైట్ ఖనిజాన్ని తరలించేందుకు వెళుతున్న ఆ లారీ రైతు గౌతు గంగ పొలంలో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. దీనిపై ఫిర్యాదు అందలేదని ప్రత్తిపాడు పోలీసులు తెలిపారు. కాగా.. ఈ రహదారిలో లాటరైట్ ఖనిజాన్ని రవాణా చేసే లారీలే రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే మితిమీరిన వేగంతో వెళుతుండడంతో స్థానికులు భయపడుతున్నారు. ఇటీవలే క్వారీ లారీ ఢీకొని గేదే మృతి చెందింది. గతంలో కూడా అనేక ప్రమాదాలు జరిగాయి.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

దేవరపల్లి: గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై దేవరపల్లి మండలం యర్నగూడెం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి గాయపడ్డారు. రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ఆటోను వెనుక వైపు నుంచి వస్తున్న వ్యాన్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఐదేళ్ల చిన్నారిని, ఇద్దరు మహిళలకు రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్టు సమాచారం. కాగా.. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. గోపాలపురం మండలం చిట్యాలకు చెందిన కుటుంబ సభ్యులు ఏలూరులో శుభ కార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్టు తెలిసింది.

అన్నవరం.. భక్తజన సంద్రం

- రత్నగిరికి పోటెత్తిన భక్తులు
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆలయానికి గురువారం వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున రత్నగిరిపై పెద్దసంఖ్యలో వివాహాలు జరిగాయి. నవ దంపతులు, వారి బంధువులతో కలిసి, రత్నగిరిపై స్వామివారి వ్రతాలాచరించి దర్శనం చేసుకున్నారు. దీంతో ఆలయంలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. సత్యదేవుని దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. భక్తులు సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారిని 35 వేల మంది భక్తులు దర్శించగా, వ్రతాలు 1,800 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో భోజనం చేశారు. సత్యదేవుని కల్యాణోత్సవాలు ముగియడంతో మరలా సత్యదేవుడు, అమ్మవార్లకు స్వామివారి నిత్య కల్యాణం, ఆయుష్య హోమం, వనదుర్గ అమ్మవారికి హోమాలు, సహస్ర దీపాలంకారణ, పంచహారతుల సేవలు యథావిధిగా నిర్వహిస్తున్నారు. దాత మట్టే సత్యప్రసాద్ దంపతులు స్వామి, అమ్మవార్లకు చేయించిన వజ్ర కిరీటాలను సోమ, గురువారాలు మినహా మిగిలిన ఐదు రోజులు అలంకరిస్తున్నారు. గురువారం పర్వదినం సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, లింగాకారంలోని శివుడు నిజరూప దర్శనం ఇచ్చారు.

యువకుడి దారుణ హత్య



కిరణ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్

కాకినాడ క్రైం: నగరానికి చెందిన ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జగన్నాథపురం ఏటిమొగకు చెందిన వాడ్రేవు కిరణ్ (20) అవివాహితుడు. చేపల వేటతో జీవనం సాగిస్తున్నాడు. స్థానికంగా నివాసం పెమ్మాడి హరీష్ అలియాస్ చిన్న భార్యతో కిరణ్‌కు వివాహేతర సంబంధం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కిరణ్‌పై హరీష్ కోపం పెంచుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం కిరణ్ తన స్నేహితుడు శ్యామ్‌తో కలిసి పెంపుడు కుక్కను టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలోని పశువైద్యశాలకు తీసుకెళ్లాడు. అక్కడకు హరీష్ తన స్నేహితుడు మహేష్‌తో కలిసి ఆటోలో వెళ్లాడు. మాట్లాడే పని ఉందంటూ కిరణ్‌ను ఆటోలో ఎక్కించాడు. అనంతరం వివాహేతర సంబంధంపై వారిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో హరీష్ తనతో తెచ్చుకున్న బీరు సీసాతో కిరణ్ గుండెల్లో పొడిచాడు. పలు మార్లు గొంతుకోసి ఆటోలోనే చంపేశాడు. మృతదేహాన్ని స్నేహితుడి సాయంతో తిమ్మాపురం సమీపంలోని నేమం వద్ద రోడ్ కం బ్రిడ్జి వద్ద సముద్రంలోకి విసిరేశాడు.

తల్లి ఫిర్యాదుతో..

తన కుమారుడు కనిపించడం లేదంటూ కిరణ్ తల్లి దుర్గ బుధవారం రాత్రి పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో పొరుగు వారు సముద్ర తీరంలో ఉన్న కిరణ్ మృతదేహాన్ని చూసి దుర్గకు సమాచారం అందించారు. దీంతో అక్కడకు వెళ్లి ఆ మృతదేహాన్ని గుర్తించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోర్టు పీఎస్ సీఐ సునీల్ ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడికి చేరుకుని ఆధారాలు సేకరించారు. కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. నిందితులు పరారీలో ఉన్నారని సీఐ సునీల్ తెలిపారు. ఈ ఘటనపై గురువారం రాత్రి కేసు నమోదు చేశారు.

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): సరస్వతీ పుష్కరాల సందర్భంగా కాకినాడ డిపో నుంచి ప్రత్యేక బస్సు సదుపాయం కల్పిస్తున్నట్లు కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సరస్వతీ దాయం – పుష్కరయాత్ర పేరిట స్టార్ లైనర్ నాన్ ఏసీ స్లీపర్ బస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ బస్సు కాళేశ్వరంలో పుణ్యస్నానాలు, మహాకాళేశ్వరుని దర్శనం అనంతరం రామప్ప దేవాలయం, వరంగల్లు వేయి స్తంభాల మంటపం, భద్రకాళీ దర్శనం, ధర్మపురిలో స్నానాలు, లక్ష్మీనరసింహస్వామి దర్శనం, కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనం, వేములవాడ క్షేత్ర దర్శనం అనంతరం ఈనెల 18న ఉదయానికి కాకినాడ చేరుకుంటుందన్నారు. ఈ నెల 22న సూపర్ లగ్జరీ బస్సు బయలు దేరుతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాలం చెల్లిన బీరు బాటిళ్ల ధ్వంసం



బీరు బాటిళ్లను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

తాళ్లపూడి: తుపాకులగూడెం పరిధిలోని ఎలియస్ బేవరెజస్ ప్రైవేటు లిమిటెడ్‌లో కాలం చెల్లిన 9,193 కేసుల బీరు బాటిళ్లను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కేవైఎంబీ కుమార్ తెలిపారు. ఆ ఫ్యాక్టరీలో కాలం చెల్లిపోయి నిల్వ ఉన్న బీరులను ధ్వంసం చేసే కార్యక్రమాన్ని గురువారం అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ బి.స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఇసుక లారీ ఢీకొని మహిళ మృతి

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు గామన్ బ్రిడ్జి అండర్ పాస్ సర్వీస్ రోడ్డు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొవ్వూరుకు చెందిన దాసరపూడి సుధ (45) తన కుమారుడు చరణ్‌తో కలిసి దొమ్మేరు నుంచి కొవ్వూరుకు మోటార్ బైక్‌పై వస్తున్నారు. కొవ్వూరు అండర్ పాస్ సర్వీస్ రోడ్డుకు వచ్చేసరికీ వారిని వెనక నుంచి ఇసుక లారీ ఢీకొంది. రోడ్డుపై పడిన సుధ మీద నుంచి లారీ చక్రాలు వెళ్లిపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి కొవ్వూరు పట్టణ సీఐ విశ్వం చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా.. సుధ భర్త సాయికృష్ణ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు.

చెక్కు బౌన్స్ కేసులో జరిమానా, జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కులు ఇచ్చి ఒక వ్యక్తిని మోసం చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి న్యాయస్థానం జరిమానా, జైలు శిక్ష విధించింది. కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.ఉషాలక్ష్మి కుమారి ఈ మేరకు తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కేబీ ప్రతాప్ కుమార్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన దూడల శ్రీనివాసరావు వ్యాపార అవసరాల కోసమని కాకినాడలోని వెంకటరత్నంపురానికి చెందిన వెంట్రాప్రగడ మురళీ వద్ద అప్పు తీసుకున్నాడు. ఇందుకోసం శ్రీనివాసరావు రూ.1,40,66,666 విలువైన ఒక చెక్కు ఇచ్చారు. సమయానికి అప్పు తీర్చకపోవడంతో చెక్కును మురళీ బ్యాంక్‌లో వేయగా బౌన్స్ అయ్యింది. దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కోర్టు విచారణలో శ్రీనివాసరావుపై నేరం రుజువు కావడంతో 18 నెలల జైలు, రూ.1,40,66,666లు పరిహారంగా చెల్లించాలని మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు. కాగా, ఇదే శ్రీనివాసరావు మురళీకి ఇచ్చిన మరో చెక్కు కూడా బౌన్స్ అయ్యింది. దీనిలో శ్రీనివాసరావుకు 18 నెలల జైలు, రూ.3.60 కోట్లు పరిహారం విధిస్తూ తీర్పు వెలువడింది.

ఇటీవలే శుభకార్యం.. అంతలోనే విషాదం..

- ట్రాక్టర్ ఢీకొని బాలిక మృతి
- రాయవరంలో ఘటన



నాగవర్షిణి (ఫైల్)



ఘటనా స్థలంలో నాగవర్షిణిపై ఎండ పడకుండా క్లాత్ పట్టుకున్న స్థానికులు

రాయవరం: ఆ కుటుంబంలోని పెద్ద కుమార్తె ఓణీల ఫంక్షన్‌ను రెండు రోజుల క్రితమే ఎంతో ఘనంగా నిర్వహించారు. బంధువులు, స్నేహితులతో కలిసి కుటుంబ సభ్యులు ఆనందంగా గడిపారు. అక్క ఫంక్షన్‌లో చిన్న కుమార్తె ఎంతో సందడి చేసింది. రెండు రోజులు అవకుండానే ఆ బాలికను ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబళించింది. శుభకార్యం జరిగిన ఇంటిలో విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామానికి చెందిన పాలపర్తి వీర వెంకట సత్యనారాయణ, ఉమా మహేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ఓణీల ఫంక్షన్‌ను రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో నిర్వహించారు. వీఆర్ఏగా విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణ ఇంట శుభకార్యం జరగడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఇంకా ఇంట్లోనే ఉన్నారు. కాగా.. సత్యనారాయణ వరసకు మేనల్లుడైన నెల్లూరుకు చెందిన పవన్ సత్యస్వరూప్ గురువారం సత్యనారాయణ రెండో కుమార్తె నాగవర్షిణి (11)ని మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని రాయవరం వచ్చాడు. లొల్ల వైపునకు వెళ్లిన వీరు తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదానికి గురయ్యారు. నాగవర్షిణిపై నుంచి ట్రాక్టర్ తొట్టి వెనుక చక్రాల వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడింది. పవన్ సత్య స్వరూప్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

విలవిల్లాడిన బాలిక

ట్రాక్టర్ చక్రాలు ఎక్కేయడంతో తీవ్రంగా గాయపడిన నాగవర్షిణి విలవిలలాడింది. ఆమె వద్దకు వెళ్లడానికి ఎవ్వరూ సాహసించలేదు. సుమారు పావుగంట తర్వాత సమీపంలోని ఫొటో స్టూడియో నిర్వాహకుడు కారంపూడి సత్తిబాబు అక్కడకు వచ్చి బాలిక శరీరంపై క్లాత్‌ను కప్పాడు. ఆ తర్వాత స్థానికులు వచ్చి సాయమందించారు.

ఘటనా స్థలానికి పోలీసులు

ప్రమాదం జరిగిన వెంటనే విషయం తెలుసుకున్న రాయవరం ఎస్సై డి.సురేష్ బాబు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలికను 108లో రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మండపేటకు తీసుకువెళ్లారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లుగా వైద్యులు ధృవీకరించారు. సంఘటనా స్థలాన్ని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

జల్‌జీవన్ మిషన్ పనుల్లో చిన్నారులు



రామచంద్రపురం రూరల్: తోటపేట గ్రామంలో రూ. 79 లక్షల నిధులతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనుల్లో భాగంగా జరుగుతున్న పైపులైన్ పనుల్లో సుమారు 10, 12 సంవత్సరాల చిన్నారులు పనులు చేయడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే చిన్నారులను ప్రభుత్వం తరఫున జరుగుతున్న పనుల్లో ఉపయోగించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్.రాహుల్ వివరణ కోరగా వివరాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటామన్నారు.

రాజుల తూరంగిలో భారీ చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్

కాకినాడ రూరల్: రాజుల తూరంగి గ్రామంలోని పురోహితుడు చంద్రమౌళి శ్రీనివాసశర్మ ఇంట్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సుమారు రూ.15 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదును దొంగలు దోచుకున్నారు. ఇంద్రపాలెం పోలీసులు వివరాలు ప్రకారం.. శ్రీనివాసశర్మ గృహ ప్రవేశం పూజ కోసం రాత్రి 10.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఆయన భార్య పుట్టింటికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేరు. ఇది గమనించిన దొంగలు లోపలకు ప్రవేశించి బంగారం, నగదు చోరీ చేశారు. పూజా కార్యక్రమం అనంతరం గురువారం ఉదయం 6 గంటలకు వచ్చిన శ్రీనివాస శర్మ.. ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించారు. లోపలకు వెళ్లి చూడగా చోరీ విషయం బయటపడింది. వెంటనే ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ మనీష్ దేవరాజు పాటిల్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దింపి వేలి ముద్రలు, ఇతర ఆధారాలను సేకరించింది. ఇంద్రపాలెం అదనపు ఎస్సై సూర్య కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

దేవరపల్లి: బైక్‌పై వేచిఉన్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. ఈ ఘటనలో మరో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. గొల్లగూడెంకు చెందిన ఈరోతు జయకృష్ణ (35) దేవరపల్లిలోని ఒక పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. గొల్లగూడెంలో గురువారం సాయంత్రం తాగునీరు తీసుకురావడానికి టిన్నులను తీసుకుని బైక్‌పై వెళుతుండగా రోడ్డుపై వేగంగా వస్తున్న లారీని గమనించి రోడ్డుపై ఆగాడు. ఇంతలో అక్కడ ఉన్న కిళ్లీ షాపు వద్ద ఆగిన ట్రక్ ఆటోను, జయకృష్ణ బైక్‌ను లారీ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో జయకృష్ణ బైక్‌తో పాటు దూరంగా పల్లపు ప్రాంతంలో ప్రాంతంలో పడిపోయాడు. ఆటోలో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా, వారిని 108లో గోపాలపురం ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటి తర్వాత జయకృష్ణను గమనించి. స్థానికులు.. చికిత్స కోసం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే జయకృష్ణ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి.సుబ్రహమణ్యం తెలిపారు.